



కళ్ళు తెరిచేటప్పటికి తల అంతా భారంగా ఉంది. పరిసరాలన్నీ క్రొత్తగా వున్నాయి. ఏమిటిదీ? హాస్పటలు వార్డులోకి ఎలా వచ్చాను?

నెమ్మదిగా గుర్తు చేసుకోవటానికి ప్రయత్నించాను. నిన్న ఆఫీసునుంచి రాంగానే జ్వరం వచ్చినట్లుండి· అలాగే కండ్లు మూసుకొని పడుకున్నాను. అదృష్టం బాగుండి లలిత వచ్చి హాస్పటలులో చేర్పించి ఉంటుంది.

బాలభానుని బంగారు కిరణాలు కిటికీ గుండా వార్డులోకి ప్రసరిస్తున్నాయి. లేత ఎండలో ఉల్లాసంగా ఊగుతున్నాయి విరగబూచిన గన్నేరు కొమ్మలు. దూరంగా వస్తున్న లలిత కనిపించింది. మెత్తటి చిరునవ్వు చిందిస్తూ స్టూలు మంచం దగ్గరగా జరుపుకున్నది లలిత.

'అక్కా! ఎలా ఉంది జ్వరం?' అంటూ చేయి పట్టుకుని చూసింది.

'కాలిపోతున్నదే' దిగులుగా నా వంక చూసింది.

'అనారోగ్యంగా ఉంటె నాకు కబురు చేయకూడదా?' చిరుకోపం నటిస్తూ నా వంక చూచింది లలిత.

దగ్గరగా కూర్చున్న లలితచేతిని నా చేతిలోకి తీసుకుంటూ 'నీకు దివ్యజ్ఞానం ఉందని, ఈ అక్కకి ఏం జరిగినా నీకు తెలుస్తుందని' కంఠం బొంగురు కావటంతో మరి మాట్లాడలేక పోయాను. ఒక్కసారి వెల్లువలాగ ఉప్పొంగిన ఆ ప్రేమాతిరేకంలో ఎంతసేపు అలా వున్నామో...

'ఇంటికి లెటరు వ్రాయమంటావా' లలిత—

'వద్దు. ఈ వేళ రాత్రికి నార్మల్‌కి వచ్చేయదూ, ఖంగారుపడుతుంది అమ్మ' అన్నాను.

'డాక్టర్ వస్తున్నారు' లలిత గొంతు తగ్గించి చెప్పింది. నాలుగు బెడ్స్ అవతల వున్నాడు డాక్టర్.

ఆ అతడు మాధవ్...సందేహం లేదు. అదే కంఠం. ఎన్నేళ్ళ తరువాత! తెలిని హాయితో మనసంతా నిండిపోయింది.

నా బెడ్ దగ్గరగా వచ్చాడు మాధవ్. నన్ను చూడగానే అతని వదనంలో మెరుపును స్పష్టంగా చూడగలిగాను.

నర్సు చేతిలో థర్మామీటరు తీసుకొని జ్వరం చూస్తూ—

'సాయంకాలానికి తగ్గిపోతుంది. మళ్ళీ వస్తాను' అంటూ, నర్సుకు ఏం వాడాలో చెప్పి కదలిపోయాడు మాధవ్.

'అక్కా!' ఆలోచనలో వున్న నేను లలిత పిలుపుతో ఈ లోకంలోనికి వచ్చాను.

'నీరసంగా ఉందా! ఏమయినా పుచ్చుకుంటావా?' లలిత—

'ఏం వద్దు! ఒక్కరోజు ఫరవా లేదులే' అన్నాను హృదయంలో చెలరేగే సంచలనాన్ని అణచుకుంటూ.

ఓ గంట కూర్చుని, కాలేజి టైమ్ అవుతున్నదని, లలిత వెళ్ళిపోయింది.

లలిత బి. ఎస్‌సి. సెకండియర్ చదువుతున్నది. ఎంతో సౌజన్యవతి. లలిత నిర్మల గంగానదీ ప్రవాహమంత స్వచ్ఛమైన హృదయం కలది. లలిత స్నేహమే లేకపోతే, ఏమయివుండేదో తను ఎంత వ్యధలోనున్నా, సమీరంలాంటి లలిత చల్లని పిలుపు హృదయాహ్లాదాన్ని కలుగజేస్తుంది. దూరంనుంచి ఎక్కడో... రికార్డులు వినిపిస్తున్నాయి.

'నిన్ను, నిన్నుగా ప్రేమించుటకు,
నీ కొరకే కన్నీరు నింపుటకు'

పాటలో భావాన్ని గ్రహిస్తూ వింటున్నాను.

'రాధా ఎలా ఉంది' మాధవ్ బెడ్ దగ్గరగా నిలబడి పిలుస్తున్నాడు.

'కూర్చో మాధవ్' ఎన్ని సంవత్సరాల తరువాత, ఆనందంతో మాటలు రావటం లేదు. మాధవ్ మరింత దగ్గరగా

కూర్చుంటూ, నా చేయి చేతిలోనికి తీసుకుని కూర్చుండిపోయాడు.

'ఈ క్షణం నా జీవితంలో ఎంత విలువైనదని' అదేమాట బిగ్గరగా అన్నాను.

'రాధా' మాధవ్ కండ్లలో నీళ్ళు నిలిచినాయి.

'ఆ సంగతి నాకు కూడా తెలియపరచకుండా వున్నావెందుకని?' సమాధానంగా చిరునవ్వు నవ్వాను.

'అదిసరే! ఎన్నాళ్ళయింది ఈ ఊరు వచ్చి.'

'మూడేళ్ళ' న్నాను.

ఆశ్చర్యంగా నావంక చూశాడు.

'సరోజ కులాసా! పిల్లలో' నవ్వుతూ అడిగాను. అంతకుముందున్న అన్యమనస్కత అంతా ఎలా ఎగిరిపోయిందో మరి?

తల ఊపుతూ 'ఒక పాప పేరు అనూరాధ' మాధవ్ లేచి నిలబడుతూ 'ఇది పొలాలు కదా, మనలని ఇంత సన్నిహితంగా ఎవరూ చూడటం అంత మంచిది కాదు.'

'మరి వెడతాను' అన్నాడు.

'పునర్దర్శనం'

'సాయంకాలం'

వెళుతున్న అతన్ని కనుమరుగయ్యే వరకు చూస్తూ వుండిపోయాను.

మనస్సు గతంలోకి...ఆగకుండా పరుగులు తీస్తూంది.

# మూగవోయిన మురళి

మధురాను భూతులతో, మమతలు పందిళ్ళు వేసిన రోజులవి. మాధవ్ ఇల్లూ మా ఇల్లూ ప్రక్క ప్రక్కనే. ఆటపాటలతో ఎలిమెంటరీ స్కూలు చదువు ముగిసింది. ప్రక్కఊరి హైస్కూలులో చేరాం ఇద్దరం.

ఆ రోజులు...గురువు, దైవం, చెలుడు అన్నీ మాధవ్ నాకు. అతనికి ఒక అపురూపమైన చెలిని నేను.

మూడు మైళ్ళు నడచి వెళ్ళాల్సి వచ్చేది. బండిలో వెళ్ళమని అన్నా నడిచి వెళ్ళేందుకే సిద్ధపడే వాళ్ళం.

చిన్నతనంలో నడక అంటే అంతగా లైక్ చేసేవాళ్ళం. పొలాల గట్లమ్మటే వడుస్తూ, పెసరకాయలు, అవీ తింటూ, అస్తమిస్తున్న ప్రకృతి అందాన్ని తనివి తీర ఆస్వాదిస్తూ... హాహ్...ఆ జీవితం, ఆనందం అనుభవైక వేద్యం.

ఊరిచివర శివాలయం మా శనాదివారాలకు నిడిదిగా వుండేది. ఆ శివాలయంలో చేరి ఎంతగొడవ చేసేవాళ్ళమో...

ఆ రోజు...ఒక శనివారం మధ్యాహ్నం ... ఆ రోజు అలా జరిగి ఉండకపోతే ... మరి నా జీవితం ఎలా మలుపు తిరిగి వుండేదో.

మాధవ్, నేనూ విప్పటా శివాలయం ఆవరణలో ప్రవేశించాం.

మాధవ్ ఆరోజు గంభీరంగా, రోజూకన్నా పెద్దవాడిలా కనిపిస్తున్నాడు.

'ఏం అలావున్నావు?' అన్నాను.

ఇవాళ నేను భలే ప్లాన్ వేశాను తెలిస్తే ఆశ్చర్యపోతావు'

'ఏమిటది! చెప్పు మాధవ్'

అడవిమల్లె చెట్టుక్రింద కూర్చుంటూ అడిగాను.

'రాధా! మనం చాలాసార్లు బొమ్మల పెళ్ళిళ్ళు చేశాంకదూ! ఇవాళ మనిద్దరం పెళ్ళి చేసుకుందాం. తలెత్తి ఆశ్చర్యంగా మాధవ్‌వంక చూశాను. పదేళ్ళ నా మనసు చురుగ్గానే ఆలోచించింది.

'పెళ్ళిఅంటే పెద్దవాళ్ళు చేస్తారు'

మాధవ్ నవ్వుతూ 'చిన్నప్పుడు చిన్నవాళ్ళు చేసుకుంటే, పెద్దయ్యాక పెద్దవాళ్ళు చేస్తారుట.'

'ముందు మనిద్దరం కలిసి పూలు కోసేద్దాం, తరువాత' ఆ పదిసంవత్సరంలో ఏమి ఆకర్షణ వున్నదో, అతనేదయినా మాట్లాడితే కళ్ళు విప్పార్చి చూడటమే గాని ఎదురు ప్రశ్నించడం అంత ఉండేది కాదనుకొంటా.

ఇద్దరం కలిసి పూలు అందినవన్నీ కోసేసి గుట్టగా పోశాం.

జేబులో మాదీదారం బయటకు తీశాడు మాధవ్. ఇద్దరం కలిసి రెండు దండలు గుచ్చాం.

'శివుడికి నమస్కారం చేసి, అక్కడ దండలు వేసుకుందాం' అన్నాడు మాధవ్.

మంత్రముగ్ధలాగ తల ఊపాను.


తెలిసీ, తెలియని బాల్యంలో, పరమేశ్వరుని సాన్నిధ్యంలో మానసికంగా మాధవ్ అర్ధాంగినయ్యాను. ఆ క్షణం ఎటువంటిదో! మాధవ్‌పై నాకనురాగము ఎక్కువయిందంటే అతిశయోక్తి కాదనుకుంటాను.

కాలచక్రం వేగంగా పరుగులు తీస్తోంది. నేనూ మాధవ్, ఇద్దరం యస్. యస్. యల్. సి. ప్యాసయ్యాము.

అమ్మా, నాన్నగారి ఉద్దేశ్యం నన్ను మాధవ్‌కిచ్చి చెయ్యాలనే.

వయస్సూ, విజ్ఞానమూ రెండూ పెరిగినాయి.

మాధవ్ ఇంటికి చిన్నతనంలో లాగ



పెళ్ళాన్నా ఎందుకో అదోలా అనిపిస్తున్నది.

మనస్సులో మాధవ్‌ని మరీమరీ చూడాలనిపిస్తుంది. కాని తలెత్తి అతనిని చూస్తుంటే, అతనూ నా కండ్లలోకి తదేకంగా చూస్తుంటే సిగ్గుతో, కనురెప్పలు రెండూ వాలిపోయేవి.

యస్. యస్. ఎల్. సి. మార్కులు వచ్చాయి. నాన్నగారికి నన్ను చదివించాలని ఉద్దేశ్యం ఏమీ ఉండేది కాదు. నన్ను కాలేజికి పంపించటం ఆయనకు సుతరామూ ఇష్టంలేదు. మాధవ్ పట్నం కాలేజి చదువుకు ఆ రోజే వెళుతున్నాడని తెలిసింది.

ఆ రోజా సాయం సమయం. విరిసిన గులాబీల వెచ్చని ప్రభాతపు కైవారంలా వున్నది మానసం. మాధవ్ స్మృతులు మదిలో తల ఎత్తుతుంటే. రేపు మాధవ్ పట్నం వెళ్ళిపోతాడంటే ఏదో విషాదచ్ఛాయలు చీకటిలా ముసురుకుంటున్నాయి. మాధవ్‌ని కలుసుకొని ఒక్కసారి కరువు తీరా మాట్లాడాలని వున్నది. ఎలా, చెల్లి వచ్చి మాధవ్ వచ్చాడక్కా అని చెప్పటంతో పురివిప్పిన నెమలినే అయ్యాను ఒక్కక్షణం బయట నాన్నగారితో మాట్లాడుతున్నాడు మాధవ్. హాల్లో కాలుకాలిన పిల్లిలాగ తిరుగుతున్నాను.

# మూగవోయిన మురళి

నాన్న వీధిలోకి వెళ్ళగానే లోపలికి వచ్చాడు మాధవ్.

'రాధా' మాధవ్ ఉత్సాహంగా పిలుస్తూ లోపలికి వచ్చాడు.

'నేను రేపు ఉదయమే వెళుతున్నాను. నీకు చెప్పుదామని'

రాధా మాధవ్‌ల వదనంలో విచార రేఖలు తొంగి చూచినాయి. విభ్రాంతనయ్యాను ఒక్కక్షణం.

'ఏమిటీ' అన్నాను తెలీనట్లు.

'మొన్న నువ్వు ఒక ఫోటో పంపించావు, చూద్దాం ఒకసారి తీసుకురా' అన్నాడు మామూలుగా కొంటెగా నవ్వుతూ.

ఫోటో తీసుకువచ్చి మాధవ్ చేతికిస్తుంటే ఫోటోతోపాటు నా చేతిని బంధిస్తూ.

'ఈ కొంటెపిల్లతో రోజూ మాట్లాడాలనే' నా పదిహేనేళ్ళ జీవితానికి సార్థకత లభించినట్లు ఫీలయ్యాను.

'మరి నీదో' అడగలేక అడిగాను.

కొంటె చూపులతో నా కాలు తొక్కుతూ,

'ఓహో ... పంపిస్తే మరి. నేనే ఇస్తే పోనీ' ఆ మాధవ్ ఫోటోని అతి రహస్యంగా. దాచాను నా పెట్టె అడుగున. నా హృదయ ఫలకంలో భద్రపరిచాను అంతకన్న జాగ్రత్తగా.

మాధవ్ పి.యు.సి. చదువుతున్న ఆ ఒక్క సంవత్సరంలో ఎన్నిమార్పులు! విధి నా వంక చిన్నచూపు చూసింది. కారు ప్రమాదంలో నాన్నగారి మరణం మా కుటుంబంలో అనేక మార్పులను తీసుకు వచ్చింది. మా అమ్మ మా ఆస్తి అజమాయిషీలన్నీ లక్ష్మీనారాయణగారు (అంటే మా శ్రేయోభిలాషులు)కు అప్పగించి పట్నం వచ్చేసింది. మమ్మల్ని అందరినీ చదివించడమే మంచిదని సలహా ఇచ్చారు అందరూ. తరువాత నేను కాలేజిలో చేరడమూ, మా చిన్నతమ్ముడిని కూడా బడిలో వేయటమూ అన్నీ వెంట వెంట జరిగిపోయినాయి.

మాధవ్ తల్లితండ్రులు మా కుటుంబ విషయాలు ఏమీ పట్టించుకొనలేదు. మా అమ్మ మా వివాహ విషయం ఏమీ ఆలోచించటం లేదు.

డాక్టరు కోర్సులో చేరిన మాధవ్ మాకు అందటం అసాధ్యమే కట్నాల విషయంలో చూసుకుంటే.

అందుకనే మాధవ్‌ని గురించిన ఆలోచనా తగ్గించాను. చదువుమీద దృష్టి కేంద్రీకరించాను.

పి. యు సి. పాసయి బి. ఏ. లో జాయినయ్యాను. నా తరువాతది మా చెల్లి ఇందిర ఫిఫ్త్‌ఫామ్ పాసయి జూన్. యస్. ఎల్. సి. లోకి వచ్చింది. తమ్ముడు కూడా హైస్కూలుకు వచ్చాడు. కాలం ఎవరి కోసమూ ఆగదు. అదృష్టవంతులకు అదృష్టాన్ని అందిస్తూ, దురదృష్టవంతులకు దురదృష్టాన్ని అందించి పోతూ వుంటుంది.

విరిసీవిరియని నా లేతమనసుని మాధవ్‌కి అంకితం చేసాను ఇంకొకరిని ఆ స్థానంలో ఊహా...ఊహించుకోలేను. ఆ భావనే నా మనస్సును వేయి కత్తులతో కోస్తున్నట్లుగా వుంది.

మా మేనమామలు ఎవో మాకు అందుబాటులోఉన్న సంబంధాలు తీసుకువచ్చారు. నేను చేసుకోనని, ఉద్యోగం చేస్తానని చెబుతూ చదువుకున్నన్నాళ్ళు తప్పించుకుంటూ వచ్చాను. బి. ఏ. పరీక్షాఫలితాలు



ఈ మంత్రిగారు చాలా తెలివైనవారిలా వున్నారే! 'పంచదార పరిస్థితి ఈ మధ్య సంతృప్తికరంగా ఉంది- త్వరలోనే సరిచేస్తాం' అన్నారు!!

తెలిసినరోజున వింత ఆనందాన్ని చెప్పలేను.

సెకండ్‌క్లాస్ వచ్చింది. హిమాలయ పర్వత శిఖరాల నధిరోహించినంత ఆనందం కలిగింది. ఆ రోజు మాధవ్ మా ఇంటికి వచ్చాడు. బహుశా అదే అతనిని సరిగా చూడటము. తరువాత 'అతని దివ్య రూపాన్ని ఊహల్లోనే కాని కనులార సందర్శించే భాగ్యం కలుగలేదు.

కాఫీ చేసి ఇస్తూంటే,

'ఫర్‌దర్ ప్రోగ్రాం ఏమిటి ?' అన్నాడు.

'ఏముంది హాయిగా ఉద్యోగం చేయటమే' అన్నాను నవ్వటానికి ప్రయత్నిస్తూ.

'చాలా సంబంధాలు వస్తున్నాయి. వాన్న కూడా తొందర పడుతున్నారు.'

మౌనంగా వింటున్నాను.

'నీకేమీ అనిపించడంలేదూ' ఆశ్చర్యం అతని గొంతులో ప్రస్ఫుటమౌతున్నది

'ఎందుకూ?'

ఒక్క క్షణం తడబడ్డాడు. వెంటనే రికవర్ అవుతూ —

'నీకు తెలీదా రాధా ! చిన్నప్పటినుండి మనం కన్న కలలన్నీ కల్లలేనా ! ఏం కు నీ బాధ స్పష్టంగా చెప్పు ?'

సోఫాలో వెనక్కి వాలుగా చిన్నగా చెప్పాను.

'మాధవ్ ! నీవేమో డాక్టరు కోర్సు చదువుతున్నావు. వేలకువేలు కాదంటే లక్షలకట్నం ఇస్తామంటూ ఎగబడతారు నీ కోసం ఆడపిల్లల తండ్రులు మేము ఇవుడు సామాన్య సంసారులం. కట్నం లేకుండా నన్ను నీవు చేసుకోవటానికి మీ నాన్న ఇష్టపడతారా ! నీవే ఆలోచించు నీకా ధైర్యంవుంటే నాకేమీ అభ్యంతరం లేదు'

మాధవ్ ఆలోచిస్తున్నట్లు అతని వదనమే చెబుతుంది.

'నీవేమో శ్రీ రామచంద్రుడివి! ఇంకెలాగ? నాకేమీ నమ్మకంలేదు' అన్నాను.

'మరి' అన్నాడు.

'ఏముంది! హాయిగా పెళ్ళి చేసుకొని జీవితంతో రాజీపడటమే' ఆ మాట లంటున్నప్పుడు మాధవ్ నా వంక ఆశ్చర్యంగా చూసాడు. బహుశా అతని ముందు చాలా పెద్దదానిలా కనిపించివుంటాము,

వాయిదాల చెల్లింపుపై ట్రాన్‌సిస్టర్



వెల రు. 165/-
(గ్యారంటీతో)
నెలకు రు. 5/-
ంతున చెల్లించి

బ్యాండ్ ... ఎంరి పోర్టబుల్ ట్రాన్‌సిస్టర్ పొందండి. ప్రతి గ్రామానికి పట్టణమునకు సంపగలము వివరములకు నేడే వ్రాయండి

SHEBA SALES (23)
Roop Nagar, Delhi-7.

35సం॥ అనుభవం
వరి బీజము బుడ్డలు బీజకుట్లు
మొదలగు వ్యాధులకు ఆపరేషన్
లేకుండా గ్యారంటీగా బాగుచేయబడును
వివరములకు:
రా అండ్ కో ఆసుపత్రి
గౌలిగూడ సియ బస్ డిపో ఎదురు,
రామ్ మందిర్ రోడ్, హైదరాబాద్-12 ఆ.ప్ర
ఆఫీస్ ఫోన్: 42870 ఇంటి ఫోన్: 38544.

పోషణ, బలానికి పెట్టిన పేరు-బాదంకాయలు.
మీ జుట్టు చిరకాలం ఒత్తుగా, మెత్తగా
వుండాలంటే వాటికి పోషణ, బలాన్ని ఇచ్చే
ఒక తలనూనె కావాలి అదే-
ల్యూర్ ఆమండ్ హెయిర్ ఆయిల్.

ల్యూర్ ఆమండ్ హెయిర్ ఆయిల్ అసలైన బాదంకాయలు, ఖనిజ లవణాలనుంచి తయారు చేయబడింది. ల్యూర్ ఆమండ్ హెయిర్ ఆయిల్ శోషించియున్న మీజుట్టు కుదుళ్ళకు పోషణ, బలాన్ని చేకూర్చి ఒత్తుగా పెరుగుటకు దోహదమవుతుంది.

ప్రతి రోజు వాడినట్టయితే వెంట్రుకలు రాలకుండా వుంటాయి.

మీ జుట్టుకు పోషణ, బలాన్ని చేకూర్చే తలనూనె. ల్యూర్ ఆమండ్ హెయిర్ ఆయిల్

డిస్ట్రిబ్యూటర్లు దక్షిణ భారతంలో:
టి. టి. కృష్ణమాచారి అండ్ కంపెని





ఆ తరువాత చాలాసేపు వివిధ విషయాలు మాట్లాడుకొన్నాం.

తరువాత సంవత్సరానికి నేను నూజివీడులో పని చేస్తున్నప్పుడు, మాధవ్ వద్దనుంచి లెటర్ వచ్చింది.

ఇంటి దగ్గరనుంచి రీడైరక్టు చేసారు. ఆ లెటర్ నా కళ్లముందు నిలుస్తూనే ఉంటుంది.

'నా ప్రణయ సామ్రాజ్ఞి రాధకి,

నీలిమ ఆకాశాన్ని అంతటా ఆవరిస్తుంటే, కెరటాలు పైకి లేస్తూ, నెలరాజుని అందుకోమని దోబూచులాడుతుంటే, పిల్లతెమ్మెర నాకు సందేశమిస్తూ పారిపోయింది.

'లేవోయి మాధవా! ప్రమోగింపవోయి మురళి రాధ నీకొరకే ఎదురు చూస్తూ, యుగయుగాలుగా కూర్చున్నదోయి జమునా నది సైకతాల్లో' అని. లేచి నిలబడ్డాను. ఏదీ! నా ప్రణయదేవి సాక్షాత్కరించదే. నాకు రెక్కలుంటే ఎంత బాగుండును అని అనిపించింది. నీ విరహంలో నాలేవాడిని కదా!

# మూగవోయిన మురళి

నేత్రాలు మూసుకొని వృక్షచ్ఛాయలో కూర్చుంటే కెరటాల అలల్లో విందుగా నీ రూపం సాక్షాత్కరించింది. పరుగెత్తాను అందుకొందామని, ఏదీ మాయమయిపోయిందే నీ మూర్తి.

రాధా! అమ్మా నాన్నగారితో సరోజను చూడటానికి వెళ్లాను. సరోజ వదనంలో రాధే కనిపించింది. రాధే...సరోజ...సరోజే రాధ.. ఇదేనా నీవు అన్న రాజీ.

ఓహ్ రాధా...

త్వరలో శుభలేఖ అందుకుంటావు. రాగలవా మరి.

నీతోనే
మాధవ్.'

తరువాత శుభలేఖ వచ్చింది. స్వహస్తాలతో పెయింట్‌చేసి పెయింటింగ్ ప్రగిఫ్ట్ చేస్తూ పంపించాను.

తరువాత ఈ ఊరికి ట్రాన్స్‌ఫర్‌అయి మూడేళ్లయింది. మాధవ్ ఈ ఊళ్లోనే ఉన్నాడని తెలీదు. క్రొత్తగా వచ్చి ఉంటాడు.

ఎప్పుడు నిద్రావస్థలోకి జారిపోయానో!...మెలకువ వచ్చేటప్పటికి లలిత కూర్చొనుంది.

'ఎంతసేపయింది నీవు వచ్చి' అన్నాను.

'ఇప్పుడేనక్కా-నీవు నిద్రలో వున్నావు. రాత్స్ రాలేదని జావాలజి ప్రాక్టికల్స్ లేవు.'

ఆ మర్నాడు నార్మల్‌కి వచ్చేసింది.

'ఇంటికి వెళ్లిపోవచ్చు' అన్నాడు మాధవ్, వద్దని వారిస్తున్నా జీపులో మా ఇంటి దగ్గర దింపాడు మాధవ్.

'ఎప్పుడయినా వస్తూ వుంటాలే నువ్వు వద్దన్నా' అన్నాడు మాధవ్ వెళ్లిపోతూ.

మళ్లీ మాధవ్ స్మృతులు. విలవిలయటం లేదు. ఊళ్లోనె ఉన్నాడుకదా! చూడాలనే కోరిక, తపన...అంతా అయోమయంలా ఉంది నాకు ఎలా ... ఎలా... మనిషిని మరీ చిక్కిపోయాను. ఎటు చూసినా...మాధవ్.

నా నిగ్రహం అంతా ఏమయిపోయింది? నామీద నాకే పుట్టేదు జాలీ, అసహ్యం వేసి కరుప్రతీరా ఏడ్చాను.

ఒకటే మార్గం. ఈ ఊరినుంచి ట్రాన్స్ఫర్ చేయించుకోవాలి.

ఇంకోఊరు బదిలీ చేయించుకొన్నాను. ఆర్డర్స్ వచ్చినాయి. ఇంటికి ఉత్తరం వ్రాసాను. మాధవ్‌కి లెటర్వ్రాసి పోస్టు చేసాను.

లలిత సామాన్లు సర్దడానికి సాయం చేసింది. స్టేషను వరకూ వచ్చింది లలిత.

రైలులో సెకండ్‌క్లాసు టికెట్ కొనుక్కొని ఎక్కాను. లలిత కండ్లలో నీళ్లు.

ఓహ్...ఏనాటి అనుబంధం మాది. నా కండ్లూ చెమర్చినాయి.

'అక్కా...లెటర్సు వ్రాస్తూ వుండు.'

గార్డు విజిల్ వేసాడు.

రైలు కదిలింది. లలిత చేయి ఊపుతూ నిలబడింది. నా కన్నులలో లలిత రూపం అస్పష్టంగా కనబడుతూంది. ●

